క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కందుకూరు రూరల్: మండలంలోని కంచర గుంట ఫీడర్ లైన్‌కు చెట్టు కొమ్మలు తగులుతున్నందున వాటిని తొలగించేందుకు ఆదివారం ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ టీవీ.నరసింహం తెలిపారు. ఈ ఫీడర్ పరిధిలోని కంచరగుంట, చెర్లోపాలెం, వెంకటాద్రిపాలెం, అగ్రికల్చర్ వినియోగదారులు అంతరాయాన్ని గమనించి విద్యుత్ అధికారులకు సహకరించాలని కోరారు.

జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా శ్రీనివాసరావు

ఉలవపాడు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గా కె.శ్రీనివాసరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. బాపట్ల జిల్లా సంతమాగులూరులో లెక్చరర్‌గా పనిచేస్తూ పదోన్నతిపై రెగ్యులర్ ప్రిన్సిపాల్‌గా ఇక్కడకు వచ్చారు. కళాశాల అభివృద్ధి కృషి చేస్తామన్నారు. బాధ్యతలు స్వీకరించిన ఆయనకు అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

మాలకొండ ఆదాయం రూ.8,39,050

వలేటివారిపాలెం: మండలంలోని మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఆదాయం శనివారం రూ.8,39,050 వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి సాగర్‌బాబు తెలిపారు. ఆదాయంలో భాగంగా కుంకుమార్చన రూ.23,000, తలనీలాలు రూ.30,325, ప్రత్యేక దర్శనం రూ.2,68,800, లడ్డుప్రసాదాలు రూ.1,97,175, అన్నదానం రూ.2,49,710, రూం అద్దెలు రూ.33,830 వచ్చినట్లు పేర్కొన్నారు.

విద్యుత్ లో ఓల్టేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం


వార్డుల్లో పర్యటిస్తున్న చైర్మన్ గఫార్

కనిగిరిరూరల్: లో ఓల్టేజ్ విద్యుత్ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోనున్నట్లు మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ అన్నారు. పట్టణంలోని సాయి నగర్ ప్రాంతంలో మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ పర్యటించి క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలు అడిగి తెలుసుకోగా లో ఓల్టేజీ విద్యుత్ సమస్యతో ఇబ్బంది పడుతున్నామని చెప్పగా, వెంటనే విద్యుత్ శాఖాధికారులను పిలిపించి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. క్రాయక్రమంలో విద్యుత్ శాఖ ఏఈ పవన్‌కుమార్, వికలాంగుల హక్కుల వేదిక అధ్యక్షుడు ధూలిపాళ్ల మల్లికార్జునరావు, వెంగయ్య పాల్గొన్నారు.

వినోద్ ఆత్మహత్యకు కారకులపై చర్యలు తీసుకోవాలి

ఉలవపాడు: గుడ్లూరు మండలం చేవూరులో ఆత్మహత్య చేసుకున్న రైతు నక్కలవినోద్ ఆత్మహత్యకు కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని రైతు కూలీ సంఘం నాయకులు రావి నూతల మోహన్, నాంచార్లు, వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. మరణానికి కారకులైన అధికారులు, ఇతరులపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలన్నారు. భూ పరిహారం రాకుండా అడ్డుకున్నారని వినోద్ తెలియచేశాడని, దానిపై విచారణ జరపాలన్నారు. వారి కుటుంబాని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

గుడ్లూరు: భూ సేకరణ డిప్యూటీ కలెక్టర్ పి.పద్మావతిని వెంటనే సస్పెండ్ చేయాలని బీసీవై మాజీ రాష్ట్ర సమన్వయకర్త మిరియం శ్రీనివాసులు డిమాండ్ చేశారు. పరిహారం అందలేదని ఆత్మహత్య చేసుకున్న నక్క వినోద్‌కుమార్ కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యంగా కారణంగా పరిహారం అందజేదని చెబుతున్నా ఎటువంటి స్పందన రాకపోవడంతో అతను నిరాశ చెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడన్నారు. అధికారులు భూములకు పరిహారం అందించి ఉంటే ఈ ఘటన జరిగేది కాదన్నారు. మృతుడు భార్యకు పోర్టులో ఉద్యోగం కల్పించాలని, వారి పిల్లల చదువుల బాధ్యత ప్రభుత్వమే తీసుకోవాలన్నారు. ప్రభుత్వం తన కుటుంబానికి రావాల్సిన పరిహారం చెల్లించకుంటే చేవూరులో ధర్నా చేస్తామన్నారు.

టీడీపీలో సాగునీటి సంఘాల చిచ్చు

అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే అధికార టీడీపీలో సాగునీటి సంఘాల ఎన్నికలు చిచ్చు రాజేశాయి. పైకి సాగునీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవమే కనిపిస్తున్నా ..ఆ ఏకగ్రీవం వెనుక ఎన్నో బెదిరింపులు..బుజ్జగింపులు..అలకలు.. రుసరుసలు...వర్గ విభేదాలు ఉన్నాయి. నియోజకవర్గంలో మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, టూరిజం బోర్డు చైర్మన్ నూకసాని బాలాజీలు బల ప్రదర్శనకు దిగారు. టీడీపీ నేతలు చచ్చిచెడి పార్టీ నాయకులను బుజ్జగించి బతిమాలి ఎట్టకేలకు ఏకగ్రీవం చేసుకోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఎన్నికలు ముగిసినా పార్టీలోని వర్గ విభేదాలు భగ్గుమున్నాయి.


బింగినపల్లిలో తన వర్గీయులతో చర్చిస్తున్న టూరిజం బోర్డు చైర్మన్ నూకసాని బాలాజీ

- నియోజకవర్గంలో బట్టబయలైన టీడీపీలో వర్గ విభేదాలు
- మారిటైంపై..టూరిజం తిరుగుబాటు
- ఒంటరైన టూరిజం బోర్డు చైర్మన్ నూకసాని
- టీడీపీలో రగిలిపోతున్న అసంతృప్తి వర్గాలు
- బుజ్జగింపులతో ఏకగ్రీవాలు చేసుకుని ఊపిరిపీల్చుకున్న టీడీపీ
- ఎన్నికలను.. బహిష్కరించిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు

ఒంగోలు టాస్క్‌ఫోర్స్:

కొండపి నియోజకవర్గంలో సాగునీటి సంఘాల ఎన్నికలు పార్టీలోని అంతర్గత విభేదాలను బహిర్గతం చేశాయి. కొండపి, మర్రిపూడి, సింగరాయకొండ, జరుగుమల్లి మండలాల్లో జరిగిన సాగునీటి సంఘాల ఎన్నికలు పార్టీలో అసంతృప్తి జ్వాలలు చెలరేగాయి. సింగరాయకొండ మండలంలోని బింగినపల్లి సాగునీటి సంఘాల ఎన్నికలు టీడీపీలో చిచ్చు రేగింది. టూరిజం బోర్డు చైర్మన్ నూకసాని బాలాజీ స్వగ్రామం బింగినపల్లి. దీంతో మొదటి నుంచి బాలాజీ తన ముఖ్య అనుచరుడైన నూకసాని నరశింహారావుకు అధ్యక్ష పదవి ఇవ్వాలని నిర్ణయించుకుని నియోజకవర్గ పార్టీ బాధ్యతలు చూస్తున్న మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్యకు విషయాన్ని తెలియజేశారు. అయితే దీనికి సత్య అడ్డుచెబుతూ అదే గ్రామానికి చెందిన సన్నెబోయిన మాలకొండయ్య స్నేహితుడు పూడి రోశిరెడ్డికి ఆ పదవి ఇస్తానని చెప్పడంతో వీరిద్దరి మధ్య భారీస్థాయిలో మాటల యుద్ధం జరిగినట్లు సమాచారం. చివరికి నువ్వెంత అంటే నువ్వెంత అన్న స్థాయిలో జరిగినట్లు పార్టీ వర్గాలే చర్చించుకుంటున్నాయి. దీంతో ఆగ్రహించిన బాలాజీ తన సత్తా చూపేందుకు గ్రామంలో టీడీపీ నాయకుడు పులిప్రసాద్ ఆధ్వర్యంలో తన అనుచరులతో భారీగా సమావేశం నిర్వహించి ఎన్నికల్లో రెబల్‌గా తన వర్గం చేత పోటీచేయించే ప్రయత్నం చేశాడు. దీంతో సత్య వెంటనే రెబల్ వర్గాన్ని బుజ్జగించే బాధ్యతను మంత్రి స్వామికి అప్పగించాడని, మంత్రి స్వామి వెంటనే పులి ప్రసాద్‌తో మంతనాలు చేసి మధ్యే మార్గంగా 12 టీసీల్లో చెరి ఆరుగురిని పోటీలో నిలబెట్టాలని, అధ్యక్ష పదవి రోశిరెడ్డికి, ఉపాధ్యక్ష పదవి మీ వర్గం తీసుకోవాలని బతిమాలి బుజ్జగించి చివరికి ఒప్పించాడు. అంతేకాక ఈ ప్రతిపాదనకు ఒప్పుకునే వరకు వీఆర్‌ఓతో నీటితీరువా పన్ను కట్టించుకోకుండా ఆపాడని శుక్రవారం సాయంత్రానికి రెండు వర్గాల మధ్య రాజీ కుదరటంతో పన్ను కట్టించుకున్నాడని టీడీపీ వర్గీయులు ఆరోపించారు. అంతకుముందు బాలాజీ కూడా కలెక్టర్ తమీమ్ అన్సారియాను కలిసి నీటి పన్ను కట్టించుకోవటం లేదని ఆరోపించినట్లు వెంటనే ఆమె స్పందించినట్లు మండలంలో జోరుగా ప్రచారం జరిగింది. సమస్య సమసిపోయిందిలే అని భావిస్తుండగా శనివారం ఉదయం రెబల్ వర్గీయులు తాము ఎన్నికలకు దూరంగా ఉంటున్నామని చెప్పటంతో ఎన్నికల్లో ఏం జరుగుతుందోనని టీడీపీ వర్గీయుల ఆందోళన చెందారు. పులి వర్గాన్ని 5 స్థానాల్లో, మాలకొండయ్య వర్గాన్ని 7 స్థానాల్లో పోటీ చేయమని చెప్పడంతో ఆగ్రహించిన పులి వర్గం ఎన్నికలకు దూరంగా ఉండటంతో రోశిరెడ్డి అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దీంతో నూకసాని బాలాజీ రెంటికి చెడ్డ రేవడిలా ఒంటరిగా మిగిలిపోవాల్సిన దుస్థితి ఏర్పడంతో అతను లోలోపల మదన పడుతూ నివురుగప్పిన నిప్పులా రగిలిపోతున్నాడని ఆయన అనుచరులు ప్రచారం చేస్తున్నారు.

☛ జరుగుమల్లి మండలం కె .బిట్రగుంట సాగునీటి సంఘాల ఎన్నికల్లో యర్రా కిరణ్, ఒట్టిగుంట శివాజీ వర్గాల మధ్య పోటీ ఏర్పడింది. దీంతో పార్టీ అధిష్టానం రెండు వర్గాల మధ్య బింగినపల్లిలో చేసిన ప్రతిపాదననే ఇక్కడ కూడా తీసుకుని వచ్చింది. మొదటి నుంచి పార్టీ అధిష్టానం కిరణ్ వర్గానికి మద్దతుగా ఉంది. శనివారం ఉదయం అధిష్టానం ఎన్నికలకు శివాజీ వర్గాన్ని దూరంగా ఉండాలని హుకుం జారీ చేయడంతో చేసేది లేక ఎన్నికలకు దూరంగా ఉంటున్నామని ప్రకటించారని ఆ పార్టీ వర్గీయులే చర్చించుకున్నారు. అంతేకాక శివాజీ వర్గం తరపున అధ్యక్ష పదవికి అభ్యర్థిని నిలబెట్టి శుక్రవారం రాత్రి ఎన్నికల ప్రచారం కూడా చేశారు.

☛ మర్రిపూడి మండల కేంద్రంలో జరిగిన ఎన్నికలలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు చేరెడ్డి నరసారెడ్డి వర్గానికి, మాజీ జెడ్పీటీసీ తుళ్లూరి నరశింహారావు,రేగుల వీరనారాయణ వర్గాల మధ్య పోటీ ఏర్పడగా అధిష్టానం నరసారెడ్డి వర్గానికి మద్దతు పలకటంతో రెబల్ వర్గీయులు లోలోపల రగిలిపోతున్నారు.

☛ కొండపి మండల కేంద్రంలో జరిగిన సాగునీటి సంఘాల ఎన్నికల్లో పార్టీ అధిష్టానం మానికొండ వెంకటేశ్వర్లు, ముప్పరాజు గోపాల్ వర్గాల మధ్య చెరి రెండున్నర సంవత్సరం పదవిలో ఉండేలా రాజీ కుదర్చింది. ఈ ఎన్నికలకు నియోజకవర్గంలోని టీడీపీ అధిష్టానానికి తలనొప్పిగా మారటంతో పాటు పార్టీలో ముసలం పట్టించిందని ఆ పార్టీ నాయకులే బహిరంగంగా చర్చించుకుంటున్నారు.

మన్విత్‌రెడ్డి కుటుంబానికి చెక్కు అందజేత


మన్విత్‌రెడ్డి తండ్రి అంజిరెడ్డికి చెక్‌ను అందజేస్తున్న బుర్రా

గుడ్లూరు: గుడ్లూరుకు చెందిన రామాల మన్విత్‌రెడ్డి తండ్రి అంజిరెడ్డికి కందుకూరు వైఎస్సార్ సీపీ సమన్వయకర్త బుర్రా మధుసూధన్ యాదవ్ శనివారం రూ.లక్ష చెక్కును అందజేశారు. టీడీపీ కార్యకర్తలు గుడ్లూరు పోలీస్‌స్టేషన్‌లో తప్పుడు కేసులు నమోదు చేయించి అరెస్ట్ చేయించారు. దీనిపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మనిత్ రెడ్డి కుటుంబాన్ని ఆదుకునేందుకు చెక్కు అందజేయమని పంపినట్లు తెలిపారు. మీ కుటుంబానికి జగన్‌మోహన్‌రెడ్డి పూర్తి అండగా ఉంటారని చెప్పారు. అనంతరం పాపనబోయిన వెంకటేశ్వర్లు కుమారుడు వివాహ వేడుకల్లో పాల్గొన్నారు. పొట్లూరు గ్రామానికి మాజీ డీలర్ చలంచర్ల శ్రీనివాసులు అనారోగ్యంతో బాధపడుతుండగా ఆయన్ను పరామర్శించారు. ఈయన వెంట తోకల కొండయ్య గణేషం గంగిరెడ్డి, ముప్పవరపు కిషోర్, పాశం కొండయ్య, కాపులూరి కృష్ణ, మాధవరెడ్డి, గొర్ల రమేష్, బిళ్లా రమణయ్య, కాపులూరి మధుసూదన్‌యాదవ్, వెంకట్రావు, వై.నరసింహం, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజల్లో దద్దాల


ఆలయంలో పూజల్లో దద్దాల నారాయణ

కనిగిరిరూరల్: వెలిగండ్ల మండలం రాళ్లపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన గుంటియ్యా స్వామి గుడి ప్రారంభోత్సవంలో వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా తొలుత ఆలయంలో పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు దద్దాల నారాయణను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీల సంఘ అధ్యక్షుడు గుంటక తిరుపతిరెడ్డి, మండల కన్వీనర్ గజ్జెల వెంకటరెడ్డి, ఎర్రబోయిన నాగూరు యాదవ్, రామన తిరుపతిరెడ్డి, కాకర్ల వెంకటేశ్వర్లు, నారాయణరెడ్డి, ముక్కు వెంకటేశ్వర రెడ్డి, ఎలికా రమణయ్య, ఎస్సీ నాయకులు కటికల వెంకటరత్నం, సర్పంచ్ సైకం స్వర్ణ ఏడుకొండలు రెడ్డి, పల్నాటి భాస్కర్ రెడ్డి, శివరామిరెడ్డి, గాండ్లపర్తి ఆదినారాయణరెడ్డి తదితరులు ఉన్నారు.

టెక్ మహీంద్రకు 25 మంది ఎంపిక


ఇంటర్వ్యూలకు హాజరైన విద్యార్థులు

కందుకూరు: స్థానిక ప్రకాశం ఇంజినీరింగ్ కాలేజీలో శనివారం ప్రముఖ ఐటీ కంపెనీ టెక్ మహీంద్ర నిర్వహించిన పస్ ఇంటర్వ్యూల్లో 25 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు కాలేజీ టెక్నికల్ డైరెక్టర్ డాక్టర్ కె. విజయశ్రీనివాస్ తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికై న వారు హైదరాబాద్‌లోని బ్రాంచ్‌లో టెక్ సపోర్టు ఇంజనీర్లుగా పనిచేయాల్సి ఉంటుందని, ఏడాదికి రూ 3.5లక్షల వేతనాన్ని పొందుతారని కంపెనీ హెచ్‌ఆర్ మేనేజర్లు ఖాదర్, నవీన్, హరి, రితిల్ వెల్లడించారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ రవికుమార్, డీన్ డాక్టర్ ఎం లక్ష్మణరావు, అకడమిక్ ఇన్‌చార్జి ఎస్ఎన్ మీరావళి, ఎంపీఓ సాహిత్య, సుమలత తదితరులు పాల్గొన్నారు.

'హలో మాల చలో గుంటూరు' విజయవంతం చేయండి

కనిగిరిరూరల్: హలో మాల చలో గుంటూరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అఖిలభారత మాల సంఘాల జేఏసీ కన్వీనర్ యర్రజాల బాల నారాయణ, కనిగిరి మాలల ఐక్యవేదిక నాయకులు శాంతరాజు అన్నారు. కనిగిరిలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఆదివారం గుంటూరులోని నల్లపాడు వద్ద జరిగే మాలల మహా గర్జనను విజయవంతం చేయాలన్నారు. కొటికల బాల బాదుర్ల, కోటపాటి రమణ దమ్ము శ్రీను పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాలు నివారించాలి


మాట్లాడుతున్న విద్యుత్‌శాఖ ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు

కందుకూరు: విద్యుత్ ప్రమాదాలను నివారించేందుకు సిబ్బంది అప్రమత్తతో పనిచేయాలని విద్యుత్‌శాఖ ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు సూచించారు. కందుకూరు డివిజన్‌లోని విద్యుత్‌శాఖ ఇంజినీర్లు, అకౌంట్స్, సిబ్బందితో శనివారం స్థానిక తిరుమల కళ్యాణ మండపంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్‌శాఖ ప్రమాదాలపై అధికారులకు అవగాహన కల్పించారు. విద్యుత్ ప్రమాదాలను నివారించేందుకు క్షేత్ర స్థాయి నుంచే అన్ని రకాల జాగ్రత్తలు పాటించాలని, లైన్ మరమ్మతులు ఎప్పటికప్పుడు చేయడంతో పాటు, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందించి పరిష్కరించాలన్నారు. పీఎం సూర్యఘర్ పథకం కింద సోలార్ విద్యుత్ వినియోగాన్ని పెంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ పథకంపై ప్రజలకు విస్తృతమైన అవగాహన కల్పించి, సోలార్ రూఫ్‌టాప్‌లు ఏర్పాటు చేసుకునేలా చూడాలన్నారు. పథకం కింద అందిస్తున్న సబ్సిడీ వివరాలను ప్రజలకు తెలిపాలన్నారు. అలాగే విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుండా చూడాలని, నిరంతరం ప్రజలకు నాణ్యమైన విద్యుత్‌ను అందించాలన్నారు. విద్యుత్‌శాఖ బకాయిలపై కూడా ప్రత్యేక దృష్టిపెట్టి పెండింగ్ బకాయిలు వసూలు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కందుకూరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం నాగేశ్వరరావు, పలువురు ఇంజినీర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో దత్త జయంతి


దత్తాత్రేయ స్వామికి ప్రత్యేక పూజలు

కనిగిరిరూరల్: దత్త జయంతి వేడుకలను శనివారం కనిగిరిలో ఘనంగా నిర్వహించారు. స్థానిక షిర్డీ సాయిబాబా దేవస్థానంలో ఉదయాన్నే స్వామికి పంచామృత అభిషేకాలు, సామూహిక ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం విశిష్ట పూజల్లో ఆలయ అధ్యక్షుడు దేవకి సుబ్రహ్మణ్యం, భాగ్యలక్ష్మి దంపతులు పాల్గొన్నారు. అనంతరం డాక్టర్ కనమర్లపూడి మల్లికార్జునరావు, అనంతలక్ష్మి దంపతులు 100 మంది మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్ష కార్యదర్శులు దేవకి సుబ్రహ్మణ్యం, పెన్నా వెంకటేశ్వర్లు, ముచ్చర్ల ధర్మారావు, వీసీ రామశాస్త్రి, ఏసీ చెంచులు, ఈర్ల గురవయ్య, వాగి చర్ల వెంకటేశ్వర్లు, మండ్ల వెంకటేశ్వర్లు, బొమ్మిశెట్టి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సాగునీటి సంఘాలు ఏకగ్రీవం

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని 12 నీటి వినియోగదారుల సంఘాలకు శనివారం ఎన్నికలు నిర్వహించగా అన్ని సంఘాలు ఏకగ్రీవమయ్యాయి.

గుడ్లూరు: మండలంలో 15 సాగు నీటి సంఘాల ఏకగ్రీవం అయినట్లు ఇరిగేషన్ ఏఈ మనోహర్ శనివారం తెలిపారు.

కందుకూరు రూరల్: కందుకూరు మండలంలోని ఏడు సాగు నీటి సంఘాలు శనివారం జరిగిన ఎన్నికల్లో మొత్తం ఏకగ్రీవం అయినట్లు ఇరిగేషన్ ఏఈ సీతారామయ్య తెలిపారు.

పామూరు: మండలంలోని 12 నీటి వినియోగదారుల సంఘాలకు శనివారం ఎన్నికలు నిర్వహించగా అన్ని సంఘాలు ఏకగ్రీవమైనట్లు తహసీల్దార్ బి.వి.రమణారావు, ఇరిగేషన్ ఏఈఈ సీహెచ్.ప్రసాద్‌లు తెలిపారు.

హనుమంతునిపాడు: మండలంలో మూడు ఇరిగేషన్ చెరువుల కింద శనివారం జరిగిన నీటి సంఘాల ఎన్నికల్లో అన్ని ప్రాదేశికాలు ఏకగ్రీవమయ్యాయి.

పీసీపల్లి: మండలంలోని మొత్తం 10 నీటి సంఘ ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. అధికార పార్టీ నేతలు ప్రతిపక్ష లేకుండా దొడ్డిదారిన ఏకగ్రీవం చేసుకున్నారు.

లోక్ అదాలత్‌లో 440 కేసుల పరిష్కారం


లోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న జడ్జి

కనిగిరిరూరల్: స్థానిక కోర్టు ఆవరణలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం 440 కేసులు పరిష్కారమైనట్లు న్యాయమూర్తి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ కె.భరత్‌చంద్ర తెలిపారు. క్రిమినల్ కేసులు 110, సివిల్ కేసులు 3, భరణం కేసులు 3, ఎస్ టి సి 324 ఇరువర్గాల వారిని రాజీ కుదిర్చి పరిష్కరించినట్లు న్యాయమూర్తి తెలిపారు. కక్షలు, కార్పణ్యాలకు వెళ్లకుండా రాజీ మార్గంలో వెళ్లి రాజ మార్గాన్ని అనుసరించాలని జడ్జి కె.భరత్ చంద్ర సూచించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


మృతుడు మన్నేపల్లి వెంకట్రావు (ఫైల్)

సీఎస్‌పురం(పామూరు): పురుగుమందు తాగి వైద్యశాలలో చికిత్స పొందుతున్న వ్యక్తి శనివారం మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. సీఎస్‌పురం గ్రామానికి చెందిన మన్నేపల్లి వెంకట్రావు(55) పామూరులోని నెల్లూరు రోడ్డు ఓ పెట్రోల్‌బంక్ సమీపంలో ఈ నెల 12వ తేదీన పురుగుమందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. అతన్ని ఒంగోలులోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో చికిత్సకు తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడు వెంకట్రావు పీజీ హాస్టల్ వ్యాపారంలో నష్టాలు రావడంతో మనస్తాపానికి గురై పురుగుమందు తాగినట్లు మృతుని భార్య రమణమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతునికి భార్య ఇద్దరు సంతానం ఉన్నారు.